بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ      نَحۡمَدُہٗ وَنُصَلِّیۡ عَلٰی رَسُوۡلِہِ الۡکَرِیۡمِ      وَعَلٰی عَبۡدِہِ الۡمَسِیۡحِ الۡمَوۡعُوۡد

**Summary of Friday Sermon Hazrat Khalifatul Masih V 26.07.2024 (Telugu)**

# జల్సా సాలానా ఇంగ్లాండ్ సేవకులు, అతిథులకు విలువైన ఉపదేశాలు

హజ్రత్ అమీరుల్ మోమినీన్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ 26.07.2024 తేదీన - హదీఖతుల్ మహ్దీ, లండన్, ఇంగ్లాండ్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశము

أَشْهَدُ أَنْ لَا إِلٰهَ إِلَّا اللّٰهُ وَحْدَهُ لَا شَرِيْكَ لَهُ وَأَشْهَدُ أَنَّ مُحَمَّدًا عَبْدُهُ وَرَسُوْلُهُ أَمَّا بَعْدُ فَأَعُوْذُ بِاللّٰهِ مِنَ الشَّيْطٰنِ الرَّجِيْمِ۔
بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ۔ اَلْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعٰلَمِيْنَ۔ الرَّحْمٰنِ الرَّحِيْمِ۔ مٰلِكِ يَوْمِ الدِّيْنِ۔ إِيَّاكَ نَعْبُدُ وَإِيَّاكَ
نَسْتَعِيْنُ۔ اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيْمَ۔ صِرَاطَ الَّذِيْنَ أَنْعَمْتَ عَلَيْهِمْ غَيْرِ الْمَغْضُوْبِ عَلَيْهِمْ وَلَا الضَّآلِّيْنَ۔

తషహ్హుద్, తఅవ్వుజ్, సూర ఫాతిహా పఠనానంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లు ఉపదేశించారు.

అల్లాహ్ తఆలా కృపానుసారం నేడు జల్సా సాలానా (వార్షిక సభ) ఇంగ్లాండ్ ప్రారంభమవుతుంది. వేలాది మంది ధార్మిక, ఆధ్యాత్మిక వాతావరణం నుండి లబ్ది పొందుటకు ఇక్కడికి వస్తుంటారు. ఈ రోజులలో ఇక్కడ హదీఖతుల్ మహ్దీలో ఒక తాత్కాలిక నగరం సిద్ధం చేయబడెను. తద్వారా ఈ వాతావరణంలో ఉంటూ మనం ప్రాపంచిక పనుల నుండి దూరమై తమ తమ ఆధ్యాత్మికత, ప్రవర్తనలను మెరుగు పరచుకొనుటకు ప్రయత్నించవచ్చును. కనుక ఇటువంటి పరిస్థితులలో వచ్చేవారికి ఏదైనా సౌకర్యం లభించేకంటే ఎక్కువ ఈ వాతావరణంలో అధికాధికంగా ఎలా ప్రయోజనం పొందగలమో చింతించవలెను. కాని మనిషికి మానవ అవసరాలు, ఆశయాలు తోడుగా ఉంటాయి. అందుకే నిర్వహకులు వస్తున్న వారికి సాధ్యమైన ప్రతి సౌకర్యం కల్గించుటకు ప్రయత్నిస్తారు. ఇదే ఉద్దేశంతో జల్సా సాలానా రోజులలో వివిధ శాఖలు ఏర్పాటు చేయబడతాయి. వేలాది సేవకులు ఉచితంగా తమ సేవలు హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం అతిథుల కొరకు అందిస్తుంటారు.

ఈ కోణంలో నేను సేవకులకు సూచించదలచినదేమనగా వారు తమ తమ విధులను ఉత్తమ రీతిలో అందించుటకు ప్రయత్నించవలెను. జల్సా అతిథులను హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం అతిథులుగా భావిస్తు సేవ చేయండి. అతిథి ద్వారా లేదా మీ దృష్టిలో ఏదేని అనుచిత సంఘటన ఎదురైనను మీరు విస్మరించండి. అల్లాహ్ తఆలా కృపానుసారం ప్రతి దేశంలో ఆతిథ్యం, ఉన్నత ప్రవర్తనల ప్రదర్శన అహ్మదియ్య సంస్థ ఒక ప్రత్యేక గుర్తింపుగా ఏర్పడినది. హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం ఇట్లనేవారు. అతిథి హృదయం అద్దం వలె ఉంటుంది. భావోద్వేగంగా ఉంటారు. అందుకే సున్నితంగా వ్యవహరించవలెను. కొన్ని బాధలు, కష్టాలను భరించవలసి వస్తుందని ఇక్కడికి వచ్చే అహ్మదీయులకు మంచిగా తెలుసు. ఇంకా జమాఅత్‌లో చేరని కొందరు అతిథులకు ప్రత్యేక సేవలందించవలెను. అన్ని శాఖలు ట్రాఫిక్ కావచ్చును, పార్కింగ్ డ్యూటీ కావచ్చును, భోజన శాఖ కావచ్చును లేదా క్రమ శిక్షణ, రక్షణ, పారిశుధ్యం, మంచి నీటి సరఫరా అనగా ఏ శాఖ డ్యూటి

అయినను అతిథులకు సౌకర్యాలు అందించుటకు కృషి చేయండి. వారికి ఎలాంటి ఇబ్బంది కలుగకూడదు.

అతిథులకు నేను చెప్పవలసిన విషయమేమనగా మీరొక పుణ్య ఉద్దేశం కొరకు, హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం అతిథులుగా ఇక్కడికి వచ్చారు. ప్రాపంచిక గౌరవం, ప్రాపంచిక సేవల బదులు ఒక స్వచ్ఛమైన ముస్లిం విశిష్టత అయిన ఉత్తమ ప్రవర్తనలలో మరింత ప్రగతి చెందుటను తమ దృష్టి యందుంచుకోండి. అల్లాహ్ కొరకు ప్రయాణించే వారికి ప్రాపంచిక సుఖాల పట్ల శ్రద్ధ తక్కువగా ఉంటుంది. కొన్ని ఏర్పాట్లలో లోపాలుంటాయి. కాని వాటిని విస్మరించవలెను. మా ఉద్దేశం ఆధ్యాత్మిక ఆహారమనే భావన వచ్చే ప్రతి అహ్మదీ ముస్లిం హృదయంలో ఉన్నచో సేవకులు మరియు అతిథులు ఇరువురు ఆప్యాయత, అనురాగాలతో ఈ రోజులను గడుపుదురు.

వచ్చే అతిథులందరితో సమానం వ్యవహరించాలని నిర్వహకులు ప్రయత్నిస్తారు. అయినను కొన్ని సార్లు హెచ్చుతగ్గులు ఏర్పడతాయి. కావున అతిథులు వాటిని విస్మరించవలెను. హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం అతిథులను చాలా గౌరవించేవారు. తమ అవసరాలను నిర్మొహమాటంగా చెప్పాలని అతిథులకు సూచించేవారు. కాని ఇది సాధారణ రోజుల విషైయం. జల్సా అతిథులకు వారు అలైహిస్సలాం ఇట్లు సూచించేవారు. అందరికి ఒకే రకమైన ఏర్పాట్లు ఉండవలెను, ప్రతి అతిథికి ఒకే రకమైన అతిథి మర్యాదలు చేయవలెను.

వారు అలైహిస్సలాం అతిథులకిట్లు గట్టిగా సూచించేవారు. ఇక్కడికి వచ్చే మీ అసలు ఉద్దేశం ధర్మం నేర్చుకొనుట, తమ హృదయం, మెదడును పవిత్రం చేసుకొనుట, అల్లాహ్ తఆలా సామీప్య దశలను అందుకొనుటకు ప్రయత్నించుట. ఇదే ఉద్ధేశంతో ప్రతి సంవత్సరం మీరిక్కడ సమావేశమైతారు. సభా ప్రాంగణంలో కూర్చొని సభా కార్యక్రమాలను, ఉపన్యాసాలను శ్రద్ధగా వినండి. సభను పూర్తిగా వినియోగించుకొనుటకు ప్రయత్నించవలెను.

దేశాల, జాతుల సరిహద్దులను, తేడాలను అంతం చేసిన జమాఅత్‌ను అల్లాహ్ తఆలా తన కృపానుసారం హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాంకు అందించాడు. ఇలా ఒక గొప్ప సోదరభావానికి పునాది వేశాడు. వారు (అ) సభ ఉద్ధేశాలలో ఒక దానిని ఇట్లు తెలియచేశారు. జమాఅత్‌లో సోదరభావ సంబంధాలు దృఢంగా ఏర్పడవలెను. ఇందుకు ఒకరు మరొకరితో భేటి అగుట కూడ అనివార్యమే. కాని తమ సమయంను సరిగ్గా వినియోగించుట కూడ ఒక విశ్వాసికి తప్పనిసరి. అందుకే సభ కార్యక్రమాలన్ని ముగిసిన తర్వాత లభించిన సమయంలో పరస్పరం కూర్చొని మాట్లాడుకోండి, సత్సబంధాలను పెంచుకోడి. కాని సమయాన్ని వృథా చేసే విధంగా ఇందులో నిమగ్నం కాకూడదు.

ఇంత పెద్ద సంఖ్యలో ప్రజలు సమావేశమైనప్పుడు కొన్ని సార్లు ఇబ్బందులు ఏర్పడతాయి. గుర్తుంచుకోండి! కోపాన్ని దిగమింగుకొనేవారే నిజమైన విశ్వాసులు. కావున సభ పరిసరాల పవిత్రతను దృష్టియందుంచుకోండి, పరస్పరం తప్పులను విస్మరించండి. ఒక సేవకుని ద్వారా ఏదేని పొరపాటు సంభవించినను కోపగించుకొనే బదులు ఓర్పు, సహనం పాటిస్తు విస్మరించండి. విశాల మనస్సు ఏర్పడినచో వివాదాలు, కలహాలన్ని అంతమైపోతాయి. కావున అతిథులకు, సేవకులకు ఇరువురికి చెప్తున్నాను విశాల మనస్సును ప్రదర్శించుట వారి కర్తవ్యం.

హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం కోరిక మేరకు పరస్పర సోదరభావంనకు ఆదర్శంగా ఉండాలని ప్రయత్నించవలెను. విశ్వాసుల గురించి ఇదే విషయాన్ని అల్లాహ్ తఆలా బోధించాడు. కనుక చిన్న చిన్న విషయాలపై వివాదానికి దిగే బదులు తమ జీవిత లక్ష్యంను పొందుటకు ప్రయత్నించ వలెను. అది రుకు, సజ్దహ్, ప్రార్థనలతో లభిస్తుంది, దైవ స్మరణతో లభిస్తుంది. ఇక్కడికి వచ్చిన ప్రతి అతిథి తన ప్రయాణంను పూర్తిగా దైవ నిమిత్తం చేసుకొనుటకు కృషి చేయవలెను. సేవకులు, అతిథులు అందరు గుర్తుంచుకోండి! ఇక్కడికి కొందరు జమాఅతేతరులు, ముస్లిమేతరులు కూడ వస్తుంటారు. గొప్ప సద్గుణాలను ప్రదర్శించినచో మౌన ప్రచారమగును. ఇతరులపై చాలా మంచిగా దీని ప్రభావం పడుతుంది. తద్వారా వారికి ఇస్లాం వైపు శ్రద్ధ కలుగుతుంది, వారు ఇస్లామీ బోధనలతో ప్రభావితమైతారు.

ఒక ముఖ్యమైన విషయం ఏమనగా ఇక్కడికి వచ్చేవారు ఒకరు మరొకరికి సలాం చేయుటను అలవర్చుకోండి, అధికాధికంగా ఇందుకు ప్రయత్నించండి. చాలా శుభ మరియు పవిత్ర దుఆ మనకు నేర్పించబడెను. సేవకులు, అతిథులు పరస్పరం సలాం చేసుకున్నప్పుడు వారు అన్ని రకాల భయం, చింతతో విముక్తి పొందినట్లే ఈ దుఆ పరస్పరం ప్రయోజనం కలిగించును. కావున ఈ రోజులలో ఇటువైపు చాలా శ్రద్ధ వహించండి. తద్వారా మనం ప్రతి చోట రక్షణ, ఆప్యాయత, అనురాగంను వ్యాపింప చేసిన వారమవుతాం. ఇలా ఈ పరిసరాలు అప్యాయత, సోదరభావంతో కూడిన ప్రాంతంగా మారును. అన్ని రకాల స్వార్థములకతీతంగా వ్యవహరించుటకు మనం ప్రయత్నించవలెను. ఈ రోజులలో తమ జీవితాలలో ఒక విప్లవం సృష్టించుటకు ప్రయత్నించవలెను. హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనిరి. సలాంను అలవర్చుకోండి, వాస్తవానికి ఎదుటి వ్యక్తి మీకు తెలిసినవారైనను తెలియని వారైనను అతనికి మీరు సలాం చేయండి.

హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం గారి ఒక సంఘటన తెలుపుతాను. ముస్లింలు మరియు క్రైస్తవుల మధ్య ఒకసారి పవిత్ర యుద్ధం అనగా (ధార్మిక) చర్చా వేదిక జరుగుతుండెను. హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం నివాసమున్న చోట అధిక అతిథులు ఉన్నందున నిర్వాహకులు వారి (అ) కు భోజనం వడ్డించుట మరచిపోయిరి. రాత్రి చాలా సమయం గడిచెను. చాలా నిరీక్షణ తర్వాత వారు (అ) భోజనం గురించి అడిగినప్పుడు చాలా ఆలస్యమైనది, భోజనం తీసి పెట్టలేదు, మార్కెట్ కూడ తెరిచి లేదు ఇప్పుడెలా అని నిర్వాహకులందరు విచారానికి గురైరి. హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం గారికి ఈ పరిస్థితి తెలిసినప్పుడు ఇట్లనిరి. 'ఇలా ఆందోళన, ఇబ్బందికి గురయ్యే అవసరమేముంది. అతిథులు భోజనం చేసిన చోట ఏమైనా మిగిలి ఉన్నచో అదే తీసుకొని రండి.' అక్కడ చూసినప్పుడు కొన్ని రొట్టె ముక్కలు తప్ప మరేమి లేకుండెను. కూర కూడ ఏమి లేకుండెను. మాకు ఇదే సరిపోతుందని వారనిరి. అనంతరం వారు (అ) అదే భుజించిరి. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం గారి అందరికంటే గొప్ప అభిమాని, వారి స.అ.స. సున్నత్‌ను ఆచరించే హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం గారి ఆదర్శం ఇలా ఉండెను. వారి స.అ.స. జమాఅత్‌లోని చేరినట్లు ప్రకటిస్తున్న మనం కూడ ఇటువంటి సహనం, ఓర్పు, కృతజ్ఞత, మనోభావాలను ఎల్లప్పుడు ప్రదర్శించ వలసిన అవసరమున్నది.

ఇంకా నేను సూచించదలచిన మరో విషయమేమనగా ఈ రోజులలో వివిధ రకాల ప్రదర్శనలు ఏర్పాటు చేయబడినవి.

హజ్రత్ ముస్లిహ్ మౌఊద్ రజియల్లాహు అన్‌హు యూరప్ పర్యటనకు ఈ సంవత్సరం వంద సంవత్సరాలు పూర్తి అగుతున్నవి. అందుకే ఇంగ్లాండ్ జమాఅత్ కేంద్ర అర్కైవ్‌తో కలిసి వివిధ చిత్రాల ప్రదర్శన ఏర్పాటు చేసినది. దీనిని తప్పక దర్శించండి. ఇదే విధంగా ఇంకా చూడదగిన ఇతర ప్రదర్శనశాలలు కూడ గలవు. సమయం ఉన్నప్పుడు సమయాన్ని వృథా చేసే బదులు ఈ ప్రదర్శనశాలలను సందర్శించుటకు కృషి చేయండి.

ఈ రోజులలో సెక్యూటిరిటి వైపు ప్రత్యేక దృష్టి సారిచండి. అన్నిటిని మించిన మన సెక్యూరిటి ఏమనగా మనం మన కుడి ఎడమన నిఘా ఉంచవలెను. కాని అన్నిటిని మించిన ఆయుధం మన వద్ద అల్లాహ్ తఆలా శరణమే. ఆ శరణాన్ని పొందుటకు ప్రత్యేకంగా ఈ రోజులలో దుఆలు, దైవ స్మరణ వైపు అధిక దృష్టి సారించవలెను. అల్లాహ్ తఆలా అందరిని ఇందుకు అనుగ్రహించుగాక!, మనం దీనిని ఆచరించువారమగుదు గాక! ఈ జల్సా విజయవంతం అగుగాక!

---

اَلْحَمْدُ لِلّٰہِ نَحْمَدُہٗ وَنَسْتَعِیْنُہٗ وَنَسْتَغْفِرُہٗ وَنُؤْمِنُ بِہٖ وَنَتَوَکَّلُ عَلَیْہِ۔ وَنَعُوْذُ بِاللّٰہِ مِنْ شُرُوْرِ اَنْفُسِنَا وَمِنْ سَیِّئَاتِ اَعْمَالِنَا۔ مَنْ یَّھْدِہِ اللّٰہُ فَلَا مُضِلَّ لَہٗ وَمَنْ یُّضْلِلْہُ فَلَا ھَادِیَ لَہٗ۔ وَنَشْھَدُ أَنْ لَّآ اِلٰہَ اِلَّا اللّٰہُ وَنَشْھَدُ اَنَّ مُحَمَّدًا عَبْدُہٗ وَرَسُوْلُہٗ۔ عِبَادَ اللّٰہِ رَحِمَکُمُ اللّٰہ! اِنَّ اللّٰہَ یَأْمُرُ بِالْعَدْلِ وَالْاِحْسَانِ وَاِیْتَآءِ ذِی الْقُرْبٰی وَیَنْھٰی عَنِ الْفَحْشَآءِ وَالْمُنْکَرِ وَالْبَغْیِ۔ یَعِظُکُمْ لَعَلَّکُمْ تَذَکَّرُوْنَ۔ اُذْکُرُوا اللّٰہَ یَذْکُرْکُمْ وَادْعُوْہُ یَسْتَجِبْ لَکُمْ وَلَذِکْرُ اللّٰہِ اَکْبَرُ۔